క్లుప్తంగా

ఘనంగా రామాలయ ప్రారంభోత్సవం



హోమం చేస్తున్న వేదపండితులు, గ్రామస్తులు

లక్కవరపుకోట: మండలంలోని దాసుళ్లపాలెం గ్రామంలో రామాలయ ప్రారంభోత్సవాన్ని గ్రామస్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో సుమారు వందేళ్ల క్రితం నిర్మించిన రామాలయం జీర్ణావస్థకు చేరడంతో సర్పంచ్ ముమ్మన ధనలక్ష్మి, ప్రసాద్‌రావు దంపతుల ఆధ్వర్యంలో గ్రామస్తులంతా కలిసి రూ.90 లక్షలతో ఆలయాన్ని పునర్నిర్మించారు. ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా వేదపండితులు ఈశ్వరశర్మ, రుత్వికులు హోమాలు, పూజలు చేశారు. గ్రామానికి చెందిన 57 మంది యువకులు 41 రోజుల పాటు శ్రీరామదీక్ష తీసుకుని ఈ కార్యక్రమం నిర్వహించడం విశేషం. ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నసమారాధన చేశారు.

ప్రజలంతా సహకరించాలి



నాగళ్లవలసలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

గుర్ల: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిసేలా ప్రజలంతా సహకరించాలని చీపురుపల్లి సీఐ షణ్ముకరావు కోరారు. మండలంలోని జమ్ము, నాగళ్లవలస గ్రామాల్లో కేంద్ర పోలీసు బలగాలు, సివిల్ పోలీసులతో కలిసి సోమవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎస్ఐ భాస్కరరావు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న అధికారి గౌరీశంకర్

గజపతినగరం: మనబడి నాడు-నేడులో భాగంగా మండల కేంద్రంలోని పొట్టావారి వీధి ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను, సంబంధిత రికార్డులను నాడు-నేడు రాష్ట్ర పరిశీలకులు అబ్జర్వర్ గౌరీశంకర్ సోమవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో నాడు-నేడు అభివృద్ధి పనులను నాణ్యవంతంగా చేశారా లేదా అని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని తెలిపారు. ఆయన వెంట ఎంఈఓ విమలమ్మ తదితరులు ఉన్నారు.

హెల్ప్ డెస్క్ ఏర్పాటు



మాట్లాడుతున్న గజపతినగరం ఈఆర్ఓ సూర్యకళ

గజపతినగరం రూరల్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ఈ 18 నుంచి ప్రారంభం కానుంది. నామినేషన్లు దాఖలు చేసేందుకు అవసరమైన పత్రాలకు సంబంధించిన సమాచారంతో పాటు అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు తహసీల్దార్ కార్యా లయంలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని గజపతినగరం అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఈఆర్ఓ) కె.సూర్యకళ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పోటీ చేయాలనుకోనే అభ్యర్థులకు సందేహాలు ఉంటే హెల్ప్ డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమణ కేసులు దత్తిరాజేరు, బొండపల్లి మండలాల్లో రెండు నమోదయ్యాయని చెప్పారు. గజపతినగరం,బొండపల్లి తహసీల్దార్‌లు సీహెచ్‌వీ.రమేష్, ఎస్.హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

ఉపకరణాలకు 100 మంది ఎంపిక



ప్రత్యేక అవసరాల పిల్లలకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

గజపతినగరం: ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉచితంగా సహాయ ఉపకరణాలు అందించేందుకు స్థానిక భవిత కేంద్రంలో నియోజకవర్గ స్థాయి ఎంపిక శిబిరం సోమవారం నిర్వహించారు. పిల్లలకు ఆర్థోపెడిక్ సతీష్,ఈఎన్‌టీ స్పెషలిస్ట్ రామకృష్ణ పరీక్షలు చేసి వివిధ పరికరాల కోసం 100 మందిని ఎంపిక చేశారు. వీరికి త్వరలో ఉపకరణాలను పంపిణీ చేయనున్నామని జిల్లా సమగ్రశిక్ష సహిత విద్యా విభాగం అసిస్టెంట్ ఐఈ కో-ఆర్డినేటర్ ఎం.భారతి తెలిపారు. ఎంఈఓలు విమలమ్మ, సాయిచక్రధర్, ఈఆర్‌టీలు శ్రీనివాసరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపించండి

- పేదల అభ్యున్నతే సీఎం జగన్ ధ్యేయం
- ప్రజల వద్దకు పాలన తీసుకువచ్చాం
- ఎన్నికల ప్రచారంలో మంత్రి బొత్స సత్యనారాయణ



మాట్లాడుతున్న మంత్రి బొత్ససత్యనారాయణ, వేదికపై జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, తదితరులు

మెరకముడిదాం: పేదల ఆర్థికాభివృద్ధి, అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని, సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమప్రాధాన్యం ఇచ్చారని రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. మండలంలోని సాతంవలసలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుతో కలిసి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు అందాయని, వివక్ష లేకుండా అన్ని గ్రామాల్లో అభివృద్ధి చేశామని చెప్పారు.సంక్షేమం, అభివృద్ధిని కొనసాగించేందుకు మరోమారు జగన్‌మోహన్‌రెడ్డికి సీఎంగా అవకాశం కల్పించాలని ప్రజలను కోరారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని చెప్పారు. నాడు-నేడులో భాగంగా పాఠశాలలను అభివృద్ధి చేశామని, పేద పిల్లలు కూడా ఇంగ్లిష్ మీడియం విద్యను అభ్యసించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంను ప్రవేశపెట్టామని చెప్పారు. గతంలో రైతులు ఎరువులు, విత్తనాల కోసం మండల కేంద్రాల్లోని వ్యవసాయ కార్యాల యాలకు వెళ్లి అవస్థలు పడాల్సి వచ్చేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామంలోనే రైతు భరోసా కేంద్రం ద్వారా ఈసేవలన్నీ అందుతున్న విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకు పాలన తీసుకువచ్చామని చెప్పారు. మే13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటు వేసి చీపురుపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను, విజయనగరం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు.

మీ గ్రామంలో చేసిన అభివృద్ధే మీకు భరోసా

గడచిన ఐదేళ్లల్లో మీ గ్రామంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను చూసి మీరు ఓటు వేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సాతంవలస ప్రజలను కోరారు. సాతంవలస నుంచి తెర్లాం మండలం పెరుమాళి వరకు ఇటీవల తారురోడ్డు నిర్మించామని, గ్రామంలో కోటి రూపాయలతో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవనాలను నిర్మించా మని చెప్పారు. ఇంటర్మీడియట్ చదువుల కోసం గ్రామ విద్యార్థులు చీపురుపల్లి, గరివిడి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని దగ్గరలోనే సోమలింగాపురంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేశామని తెలిపారు. ధీర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొత్స సందీప్‌బాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, బూర్లె నరేష్‌కుమార్, సత్తారు జగన్‌మోహన్‌రావు, స్థానిక నాయకులు పెనుమత్స రామశివరాజు, శంకరరావు, కృష్ణమూర్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమం అందించాం

- చంద్రబాబు, జగన్ పాలనను బేరీజు వేసుకోండి
- ఇచ్చిన మాటకు నిలబడే వ్యక్తి సీఎం జగన్
- మోసకారి చంద్రబాబును నమ్మవద్దు
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య



సభకు హాజరైన ప్రజలు

గంట్యాడ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీలు, కులాలు, మతాలతీతంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందించామని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నా రు. పెదమధుపాడ, చినమధుపాడ, తాటిపూడి గ్రామాల్లో సోమవారం రాత్రి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వ హించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వం పాలనకు, 2019 నుంచి 2024 వరకు వైఎస్సార్‌సీపీ ప్రభు త్వం పాలనకు మధ్య బేరీజు వేసుకోవాలని ప్రజలకు సూచించారు. దళారులు, మధ్య వర్తులు లేకుండా పథకాలకు సంబంధించిన నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీలకు లంచం ఇస్తేగానే ఏపనీ అయ్యేది కాదని ఆరోపించారు. 2014లో ఇచ్చిన 600 పైచిలుకు హామీల్లో అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రబాబునాయుడు ఏ ఒక్కటీ అమలు చేయలేదని గుర్తు చేశారు. నిరుద్యోగ భృతి ఇస్తానని యువకులను,రుణమాఫీ చేస్తానని రైతులు, డ్వాక్రా సంఘాల మహిళలను మోసం చేశాడన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ చేశారని, మేనిఫెస్టోలో పేర్కొన్న హామీల్లో 99 శాతం అమలు చేశారని చెప్పారు. మాటపై నిలబడే వ్యక్తి జగన్ అని అన్నారు. మోసం, వంచన, కుటిల రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ చంద్రబాబునాయుడని, ఆయన్ని నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను, విజయనగరం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యే అప్పలనరసయ్య కుమారుడు బొత్స సాయిగురునాయుడు, జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు జాగరపు అప్పారావు, సర్పంచ్‌లు కిలపర్తి శ్రీరామ్మూర్తి, ఆదిరెడ్డి సూర్యనారాయణ, నాయకులు నారాయణమూర్తిరాజు, పాటుపురెడ్డి సత్యనారాయణ, పాటుపురెడ్డి వెంకటరావు, యాళ్ల దేముడు పాల్గొన్నారు.

మైనార్టీలకు అండగా నిలిచేది వైఎస్సార్‌సీపీనే

- దూదేకుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే కడుబండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

శృంగవరపుకోట: మైనార్టీలకు వైఎస్సార్‌సీపీ సొంత ఇల్లు లాంటిదని,సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే మైనార్టీలకు భద్రత, భరోసా, గౌరవం లభిస్తాయని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక ఎరుకమ్మ పేరంటాలు కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి నూర్‌భాషా దూదేకుల ఆత్మీయ సమావేశం ఎస్.కోట పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ రహ్మాన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శ్రీనివాసరా వు మాట్లాడుతూ ఏయే వర్గాలు వెనుకబాటులో ఉన్నాయో వెతికి మరీ వారికి సంక్షేమం అందించిన నేత జగన్ అని అన్నారు. నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖరరెడ్డి మైనార్టీలను గుర్తిస్తే, అదే పరంపరను నేడు జగన్ కొనసాగిస్తున్నారన్నారు. ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు కల్పించిన దేవుడు రాజశేఖ రరెడ్డి అయితే, ఆయన తనయుడు సీఎం జగన్ ముస్లిం పేదలకు బాసటగా నిలిచారని అన్నారు. సీఎం జగన్ ఆలోచనల మేరకు ముస్లింల సమస్యల పరిష్కారంలో ముందుంటామన్నారు. ముస్లింల శ్మశానవాటికలకు కచ్చితంగా స్థలాల కేటాయిస్తామన్నారు. ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, విశాఖపట్నం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని అభ్యర్థించారు. నియోజకవర్గ పరిశీలకులు తైనాల విజయ్‌కు మార్ మాట్లాడుతూ అవకాశవాద రాజకీయాలకు కేరాఫ్ చంద్రబాబు అని, నాడు బీజేపీతో జట్టు కట్టి, తర్వాత ఛీకొట్టి, ఇప్పుడు మళ్లీ జట్టుకట్టారన్నారు.

మైనార్టీలను గుర్తించింది జగనే...

రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ ఓతూరు రసూల్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి దూదేకుల సామాజిక వర్గాన్ని గుర్తించిన పార్టీలు ఏమీ లేవని అన్నారు. నాడు దివంగత ముఖ్యమంత్రి మనల్ని తొలిసారిగా గుర్తించి గౌరవం, పదవులు ఇచ్చారని, ఆయన చనిపోయే నాటికే కార్పొరేషన్ ఏర్పాటు ప్రతి పాదన వచ్చిందని, అది జగనన్న హయాంలో నెరవేరిందన్నారు. ప్రతి పేదవాడికి సంక్షేమం అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్న వ్యక్తి సీఎం జగన్ అని చెప్పా రు. రాష్ట్రాన్ని పచ్చచొక్కాలకు పంచేసి, జేబు కమిటీలతో దోచేసిన చంద్ర బాబు సిగ్గు లేకుండా ఓట్లు అడుగుతున్నాడని, కూటమిని తరిమి కొట్టాలని పిలుపు నిచ్చారు.

మైనార్టీలకు రాజకీయాల్లో పెద్దపీట

రాష్ట్రవెలమ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.నాయుడుబాబు మాట్లాడుతూ మైనార్టీలకు రాజకీయాల్లో సీఎం జగన్ పెద్దపీట వేశారన్నారు. అన్ని మతాలు, వర్గాలు, కులాలకు సమ ప్రాధాన్యంన ఇస్తున్న జగన్‌ని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. రాష్ట్ర అధికార భాషాసంఘం సభ్యురాలు డాక్టర్ మస్తానమ్మ మాట్లాడుతూ మూడు పార్టీల కూటమి ముస్లింలకు మూడు ఎమ్మెల్యే సీట్లు ఇస్తే, జగనన్న ఏడు ఎమ్మెల్యే సీట్లు ఇచ్చారని చెప్పారు. మైనార్టీల సర్వతోముఖాభివృద్ధికి పాటు పడేది ఎవరో మీరే అర్థం చేసుకోవాలని సూచించారు. ముస్లిం పెద్దలు ఎమ్మెల్యే తదితరులకు సంప్రదాయ దుస్తులు తొడిగి, దువా చేశారు. దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మదీనా, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి షేక్ బాబ్జీ, కో- ఆప్షన్ సభ్యులు ఎం.డి.ఫిరోజ్‌ఖాన్, షేక్ నర్సయ్య, షేక్ ఖాసిం, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ వజీర్, జిల్లా కార్యదర్శి షేక్ అబ్దుల్‌రహమాన్, పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే వైశ్యసామాజిక వర్గానికి మేలు

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న వైశ్య సామాజిక వర్గం పెద్దలు

చీపురుపల్లి: కళింగవైశ్య, ఆర్యవైశ్య సామాజిక వర్గాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో మేలు చేసిందని, భవిష్యత్‌లో కూడా ఈ సామాజిక వర్గానికి అండగా ఉంటామని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ భరోసా కల్పించా రు. పట్టణంలోని పలువురు వైశ్య కుటుంబాలతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. వైశ్య సామాజిక వర్గాలకు రిజర్వేషన్లు కల్పించేందుకు దివంగత మహానేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఎంతో కృషి చేశారని చెప్పా రు. ఆయన వల్లే కళింగవైశ్యులకు బీసీ రిజర్వేషన్ వచ్చిందని గుర్తు చేశారు. అలాగే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చొరవతో ఓబీసీ రిజర్వేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి అంగీకారం తెలపడంతో కేంద్ర ప్రభుత్వంలో కూడా చర్చించడం జరిగిందన్నారు. డాక్టర్ టి.నీలకంఠేశ్వరరావు, ఎస్.వి.జి.శ్రీనివాసరావు, తంగుడు రామకృష్ణ, కింతలి మధు, కింతలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ మంచి చేశాం...

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కడుబండి



పుణ్యగిరిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, నాయకులు

శృంగవరపుకోట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం రాత్రి ఎస్.కోట పట్టణంలోని పుణ్యగిరి, జగన్ అన్న కాలనీ, బర్మాకాలనీల్లో ఎన్నికల ప్రచారం చేశారు. ఎమ్మెల్యేకు ఆయా కాలనీ వాసులు ఘన స్వాగతం పలకగా, మహిళలు ఎమ్మెల్యేకు తిలకం దిద్ది, హారతులిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ సారథి సీఎం జగన్‌ను ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు. ఈ ఐదేళ్ల పాలనలో ఏ ముఖ్యమంత్రి చేయని తీరుగా సీఎం జగన్ మీ గడప వద్దకు పాలన తీసుకువచ్చారని చెప్పారు. మీకు మంచి జరిగిందనిపిస్తేనే మాకు ఓటేయండని ప్రజలను నిజాయితీగా అడిగే దమ్మున్న ఏకైక నాయకుడు జగన్ అని అన్నారు. టీడీపీ నాయకుల కల్లబొల్లి మాటలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనని, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీ లక్ష్మిని గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే హైమావతి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ రహ్మాన్, స్టేట్‌ఫోక్ అకాడమీ డైరెక్టర్ వి.రాంబాబు, జేసీఎస్ ఇన్‌చార్జ్ వి.సతీష్, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు



గుర్ల: రాజీనామా పత్రాలను ఎంపీడీఓ వెంకటరమణకు అందజేస్తున్న గుజ్జింగివలస వలంటీర్లు



లక్కవరపుకోట: రాజీనామా చేసిన పోతంపేట సచివాలయ పరిధి వలంటీర్లు



దత్తిరాజేరు: రాజీనామా పత్రాలను చూపిస్తున్న పోరలి వలంటీర్లు



వేపాడ: రాజీనామా పత్రాలతో బానాది గ్రామ వలంటీర్లు

గంట్యాడ/ గుర్ల/లక్కవరపుకోట/దత్తిరాజేరు/వేపాడ: పార్టీలకతీతంగా సేవలందిస్తున్న తమపై విపక్షాలు కుట్రపన్ని ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి విధుల నుంచి దూరం చేయించాయని వలంటీర్లు మనస్థాపం చెందారు. విపక్షాలు, ఎల్లోమీడియా కుట్రలకు నిరసనగా వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. గంట్యాడ మండలంలోని నరవ సచివాలయం పరిధిలో 16 మంది వలంటీర్లు సోమవారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఇప్పటికే జగ్గాపురం, నీలావతి, మధుపాడ, కితుబర్తి, గొడియాడ, గంట్యాడ గ్రామాలవలంటీర్లు రాజీనామా చేశారు. గుర్ల మండలంలోని గుజ్జింగివలసకు చెందిన 11 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ వెంకటరమణకు అందజేశారు. ఎల్.కోట మండలంలోని పోతంపేట సచివాలయం పరిధిలో 15మంది తమ రాజీనామా పత్రాలను సచివాలయ కార్యదర్శికి అందజేశారు. ఇప్పటి వరకు మండలంలోని 10 సచివాలయాల పరిధిలో 78 మందిరాజీనామా చేశారని ఎంపీడీఓ కె.రూపేష్ తెలిపారు. దత్తిరాజేరు మండలంలోని పోరలి గ్రామానికి చెందిన 9 మంది , గొభ్యాం గ్రామం నుంచి ఒక వలంటీర్ తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ చంద్రకుమారికి అందజేశారు. అలాగే వేపాడ మండలంలోని బానాది, బల్లంకి పంచాయతీలకు చెందిన 27 మంది వలంటీర్లు ఈనెల 13వ తేదీన రాజీనామా చేశారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా ఉంటూ నిస్వార్థ సేవలందిస్తున్న తమను కించపరిచేలా టీడీపీ అధినేత చంద్రబాబు , జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఆరోపణలు చేయడంతో పాటు వారి అనుచరులతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడాన్ని నిరసిస్తూ రాజీనామాలు చేసినట్లు వారు చెప్పారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

బొండపల్లి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్థానిక జాతీయ రహదారి26-పై సోమవారం సాయంత్రం ఎస్ఐ కె.లక్ష్మణరావు ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు.ఎస్ఐ మాట్లాడుతూ వాహనాల్లో రూ.50 వేలకు మించి నగదు తీసుకువెళ్లినా, అధిక మొత్తంలో వస్తు, సామగ్రిని తరలించినా తగిన రసీదులు,బిల్లులు ఉండాలన్నారు. అన్ని రహదారుల్లోనూ నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు.

దత్తిరాజేరు: మండలంలోని మరడాం, దత్తి కూడళ్ల వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి వాణిశ్రీ ఆధ్వర్యంలో సోమవారం వాహన తనిఖీలు చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున తగిన ఆధారాలు లేకుండా నగదు,వస్తు సామగ్రి తరలించరాదని ఆమె అన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకూడదు

గంట్యాడ: వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీపీ పీరుబండి హైమావతి అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య సమస్య లేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులు , స్థానిక ప్రజాప్రతినిధులకు సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వైద్య సిబ్బంది వివరించాలన్నారు. ఉపాధి పనులు చేసే చోట తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఎంపీడీఓ భవానీ జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటేయండి



చీపురుపల్లి: గచ్చలవలసలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి వలిరెడ్డి శ్రీనివాసనాయుడు



చీపురుపల్లి: మెట్టపల్లిలో ప్రచారం చేస్తున్న డాక్టర్ బొత్స సందీప్, తదితరులు



కొత్తవలస: చీపురువలసలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ గోపమ్మ,జెడ్పీటీసీ శ్రీదేవి తదితరులు



లక్కవరపుకోట: సీతాగొర్లెవానిపాలెంలో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు, తదితరులు



వేపాడ: జాకేరులో ప్రచారం నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు



చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడిలో ప్రచారం చేపడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో సీఎం జగన్ సంక్షేమ, అవినీతిరహిత పాలన అందించారని, ఈ సుపరిపాలన కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. చీపురుపల్లి, కొత్తవలస, ఎల్.కోట, వేపాడ, గరివిడి మండలాల్లోని పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల తరఫున సోమవారం ఇంటింట ప్రచారం చేశారు. - సాక్షి నెట్‌వర్క్

అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన



శృంగవరపుకోట: ఎస్.కోట ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఫైర్ డ్రిల్ చేస్తున్న సిబ్బంది



కొత్తవలస: పీఎంఎల్ కాంప్లెక్స్ వద్ద పైఅంతస్తులో మంటలను అదుపుచేసే విధానాన్నివివరిస్తున్న సిబ్బంది



గజపతినగరం: కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎస్ఎఫ్ఓ రవిప్రసాద్, తదితరులు

కొత్తవలస: అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని పీఎంల్ కాంప్లెక్స్ వద్ద కొత్తవలస అగ్నిమాపకశాఖ అధికారి వై.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. అపార్టుమెంట్లలో అగ్ని ప్రమాదం సంభవించే సమయంలో మంటలను ఆర్పే విధానం,ప్రజలు ప్రాణాలు రక్షించే విధానం,ఫైర్ పరికరాల పనితీరును కొత్తవలస అగ్రిమాపక శకటం,శారద కర్మాగారానికి చెందిన సిబ్బంది ప్రయోగాత్మకంగా వివరించారు.

ఎస్.కోటలో..

శృంగవరపుకోట: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఫైర్ ఆఫీసర్ షేక్ మదీనా నేతృత్వంలో సోమవారం ఫైర్ మాక్ డ్రిల్ నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగే తీరు, అందుకు గల కారణాలు, నివారణ చర్యలు, ప్రాణనష్టం లేకుండా తీసుకోవాల్సినచర్యలను ఆర్టీసీ సిబ్బందికి, ప్రయాణికులకు వివరించారు.

గజపతినగరంలో..

గజపతినగరం: అగ్నిప్రమాదాల నివారణపై స్థానిక అగ్నిమాపక శాఖ అధికారి ఎం.ఎస్.వి.రవిప్రసాద్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సోమవారం అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు జరిగేటప్పుడు మంటలను అదుపు చేసే విధానాలను ప్రయోగాత్మకంగా వివరించారు.